## వరద బాధితులకు అండగా ఉంటాం..

### రూరల్ మండల పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 2: వరద బాధితులకు అండగా ప్రభుత్వం ఉన్నదని, ఎవరూ ధైర్యం కోల్పోవద్దని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి గ్రామ పరిధిలోని రాజీవ్‌గృహకల్ప కాలనీలో ఆయన ఉప ముఖ్యమంత్రి బట్టి, మంత్రులు పొంగులేటి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డితో కలిసి ఓపెన్ టాప్ జీప్‌లో పర్యటించారు. అనంతరం సీఎం మాట్లాడారు. బాధితులకు తక్షణం నిత్యవసర వస్తువులను అందజేయాలని అధికారులను ఆదేశించారు. వరదలకు దెబ్బతిన్న ఇండ్లకు తక్షణ సాయంగా రూ.10వేల చొప్పున అందజేశామన్నారు. చనిపోయిన వ్యక్తుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం అందజేస్తామన్నారు.

## బాధితులకు అండగా తెలంగాణ సర్కార్..

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


ఖమ్మం రూరల్: ముంపు ప్రాంతాల్లో బాధితులతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 2: వరద బాధితులకు అండగా ప్రభుత్వం ఉన్నదని, ప్రతి కుటుంబాన్ని అన్ని విధాలా అదుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని మున్నేటి వరద కారణంగా దెబ్బతిన్న నాయుడుపేట, జలగంనగర్, రాజీవ్‌గృకల్ప ఏరియాల్లో పర్యటించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. వరద బాధితులకు న్యాయం చేస్తామని, ప్రస్తుతం శానిటేషన్ కార్యక్రమం వేగవంతం చేశామన్నారు. కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథబాబు, ఎంపీడీవో ఎస్ కుమార్, తహసీల్దార్ పీ రామకృష్ణ తదితర అధికారులు నాయకులు ఉన్నారు.

## రైతులను ఆదుకోవాలి..జడ్పీ మాజీ చైర్మన్


సాంబశివరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

ఎర్రుపాలెం, సెప్టెంబర్ 2: భారీ వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, మృతిచెందిన వారి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు పేర్కొన్నారు. సోమవారం మండలంలో ఆయన పర్యటించారు. భవానీపురంలో మలిశెట్టి రాఘవరావు కుమారుడు సాంబశివరావు వరద దాటే క్రమంలో మృతిచెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వారి కుటుంబానికి ప్రభుత్వపరంగా 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం భీమవరంలో మాజీ జడ్పీటీసీ శీలం కవిత ఇంట్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నష్టపోయిన రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు పంబి సాంబశివరావు, శీలం కవిత, సూరనేని రామకోటేశ్వరరావు, యన్నం శ్రీనివాసరెడ్డి, సంక్రాంతి కృష్ణారావు పాల్గొన్నారు.

## వరద బాధితులను ఆదుకోవాలి


వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న మాస్‌లైన్ ప్రతినిధులు

ఖమ్మం, సెప్టెంబర్ 2: వర్షాల కారణంగా ఖమ్మం నగరంలో నష్టపోయిన వరద బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మాస్‌లైన్ పార్టీ ప్రతినిధి బృందం బొక్కలగడ్డ, ప్రకాష్‌నగర్, పంపింగ్‌వెల్ రోడ్డు, రాజీవ్ స్వగృహ తదితరుల ప్రాంతాల్లో సందర్శించి వరద బాధితులతో మాట్లాడారు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఎక్కువ ఆస్తినష్టం జరిగిందన్నారు. రామయ్య, పుల్లయ్య, అశోక్ పాల్గొన్నారు.

## వరద పోయింది.. బురద మిగిలింది


బరదను తొలగిస్తున్న దృశ్యం, సామాను బయటకు తీసుకవస్తున్న బాలికలు

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 2: మున్నేటి వాగు సమీపంలోని పలు కాలనీల్లో ఎక్కడ చూసిన వరద తగ్గింది, బురద మిగిలింది. కాలనీల వాసులు ఇండ్లకు చేరుకొని తమ ఇంటి పరిస్థితిని చూసి కన్నీటి పర్యంతం అయ్యారు. కట్టుబట్టలు మినహాయిస్తే ఏమి మిగలలేదని వాపోయారు. చేతిలో చల్లి గవ్వలేక, కనీసం తినడానికి తండి లేక పోవడంతో చంటిపిల్లలు, వృద్దులను చూసుకుంటూ తల్లడిల్లిపోయారు.

## అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 2 : నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ సబ్జెక్ట్‌ల లో బోధించడానికి అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జాకీరుల్లా సోమవారం తెలిపారు. ఇంగ్లిష్, ఎకనామిక్స్, కామర్స్, బీసీఏ, డేటాసైన్స్, బయోటెక్నాలజీలో ఒక ఖాళీ, పొలిటికల్ సైన్స్‌లో రెండు, హిస్టరీ, గణితంలో మూడు ఖాళీ లు ఉన్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ నెల 5వ తేదీన కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకి హాజరుకావాలని సూచించారు.

## దరఖాస్తుల ఆహ్వానం

మధిర రూరల్, సెప్టెంబర్ 2: మధిర పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ క ళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి మాథ్స్, ఇంగ్లిష్, తెలుగు సబ్జెక్టులను బోధించేందుకు అతిథి అధ్యాపకుల నియామకాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ నెల 5వ తేదీలోగా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని, పీహెచ్‌డీ, నెట్, సెట్ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. 6న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని న్నారు.

## గ్రామాల్లో అధికారులు అందుబాటులో ఉండాలి

వేంసూరు, సెప్టెంబర్ 2: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు గురయ్యారని, ఈ క్రమంలో గ్రామాల్లో ప్రత్యేక అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక చర్యలు చేపట్టాలని తహసీల్దార్ ఎంఏ రాజు సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐబీ డీఈ మరియన్న, ఐబీ ఏఈ రవికాంత్, పీఆర్ ఏఈ సాయి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జయలక్ష్మీ, వైద్యాధికారి హిందూప్రియాంక, ఆర్ఐ చిరంజీవి, విద్యుత్‌శాఖ ఏఈ అంకారావు, సీహెచ్‌వో వెంకటనారాయణ పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# వాన.. వరద.. నష్టం


చింతకాని: లచ్చగూడెం చెరువు చుట్టూ జాలి వేస్తున్న మత్యకారులు




చింతకాని: చింతకాని–నేరడ మధ్య కొట్టుకుపోయిన రహదారి, చింతకాని: పందిళ్లపల్లి వద్ద కొట్టుకుపోయిన రహదారి, చింతకాని: ప్రాద్దుటూరు–నేరడ మధ్య..

కొణిజర్ల, సెప్టెంబర్ 2: ఇటీవల కురుస్తున్న వర్షాలకు అన్నదాత తీవ్రంగా పంట నష్టపోయారు. మండల కేంద్రమైన కొణిజర్ల, తనికెళ్ల, పల్లిపాడు, సింగరాయపాలెం, తీగలబంజర, గుబ్బగుర్తి, సిద్ధిక్‌నగర్, అంజనాపురం, గద్దలగూడెం, ఉప్పలచెలక, పెద్ద గోపతి, చిన్నగోపతి తదితర గ్రామాల్లో పత్తి పైరు నేల కొరిగింది. సర్కారు స్పందించి తమను ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కొన్ని చోట్ల వరిపంట నేలమట్టం కాగా, ఇతర పంటలకు నష్టం వాటిల్లుతున్నట్లు రైతులు పేర్కొన్నారు.

**రహదారులు ధ్వంసం**

కొణిజర్ల, సెప్టెంబర్ 2: భారీ వర్షాల నేపథ్యంలో పలు ప్రధాన రహదారులు గుంతలమయంగా మారాయి. మండలంలోని తీగలబంజర వద్ద పగిడేరు వాగు, అంజనాపురం సమీపంలోని పెద్దఏరు పొంగి పొర్లడంతో రోడ్డు అస్తవ్యస్తంగా తయారైంది. పలుచోట్ల బుంగలు ఏర్పడి రోడ్డు కోతకు గురైంది. అధికారులు తక్షణమే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

**సహాయక చర్యలు శూన్యం**

చింతకాని, సెప్టెంబర్ 2 : మండల పరిధిలో పలు రహదారులు కొట్టుకుపోయినా కనీసం పట్టించుకున్న వారే లేరని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సత్వరమే స్పందించి రహదారులకు ఏర్పడిన గండ్లు పూడ్చి ప్రయాణాలకు, వ్యవసాయానికి అనువుగా చేయాలంటూ రైతులు, ప్రజలు కోరుతున్నారు. బొప్పారంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బాధితులకు తహసీల్దార్ ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు చేశారు. నాగిలిగొండ, నేరడ, రాఘవాపురం చెరువు కట్టలకు ఏర్పడిన గండ్లను రైతులు స్వచ్ఛందంగా పూడ్చివేశారు. సంబంధిత ఎన్నెస్పీ అధికారులు కన్నెత్తి చూడలేదని సదరు గ్రామాల రైతులు వాపోతున్నారు.

**లచ్చగూడెం చెరువులో వరద పాలైన చేపపిల్లలు**

చింతకాని, సెప్టెంబర్ 2: మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో మత్య సొసైటీ సభ్యులు ప్రైవేటుగా చేపపిల్లలను రూ.3లక్షలకు కొని పది రోజుల క్రితమే చెరువులో వదిలిపెట్టారు. నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరద ప్రవాహానికి చేపపిల్లలన్నీ కొట్టుకుపోయాయని మత్యకారులు కన్నీటి పర్యంతమయ్యారు. చేప పిల్లలు బయటకు వెళ్ళకుండా రక్షణ వ్యవస్థలో భాగంగా వలలు కూడా ఏర్పాటు చేశామని, కానీ భారీ వరద ప్రవాహనికి వలలు, చేపపిల్లలు సైతం కొట్టుకుపోయాయని మత్యకారులు వాపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని మత్యసొసైటీ గోడగు రమేష్, మత్యకారులు వేడుకుంటున్నారు.




చింతకాని: కోతకు గురైన మత్కేపల్లి బ్రిడ్జి, కొణిజర్ల: గుంతలమయంగా మారిన ఏన్కూరు రోడ్డు, కొణిజర్ల: తీగలబంజరలో ఒరిగిన పత్తిపైరును చూపుతున్న రైతు




చింతకాని: బోప్పారం సహాయక కేంద్రంలో అన్నదానం, మధిర: వర్షానికి నేలవాలిన పత్తిపైరు, మధిర: వరిపైను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

# ప్రజాపాలన కాదిది.. ప్రజావ్యతిరేక పాలన..

- ప్రజలను రక్షించలేని మంత్రులు రాజీనామా చేయాలి
- రెండురోజుల నుంచి తాగునీరు లేక అల్లాడుతున్నాం
- గృహకల్ప, ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయిస్ కాలనీ వాసుల ఆక్రందన
- మంత్రి పొంగులేటి రావాలంటూ రహదారిపై రాస్తారోకో
- 'అందరూ చచ్చాక వస్తే బాగుండేది కదా..' అంటూ మండిపాటు


ఖమ్మం బైపాస్ రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న రాజీవ్ స్వగృహ, నాలుగో తరగతి కాలనీ వాసులు

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 2: తెలంగాణలో ప్రస్తుతం నడుస్తున్నది పాలన ప్రజాపాలన కాదని, ప్రజావ్యతిరేక పాలనని రాజీవ్ స్వగృహ, నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీల వాసులు ఆరోపించారు. మున్నేరు ముంపునకు గురైన తాము నడితనీటిలో రెండు రోజులుగా అరిగోస పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ప్రభుత్వం నుంచి ఇసుమంతైనా సాయం అందలేదని అన్నారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు నశించాలని, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వచ్చి తమ కాలనీలను పరిశీలించాలని డిమాండ్ చేస్తూ స్థానిక బైపాస్‌రోడ్డుపై సోమవారం వారు రాస్తారోకో చేశారు. దాదాపు 500 మంది కాలనీవాసులు రహదారిపై బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్థానిక ఎమ్మెల్యే అయిన మంత్రి పొంగులేటి తమ కాలనీలకు వచ్చి పరిశీలిస్తేనే తాము ఈ ఆందోళనను విరమిస్తామని, లేదంటే ఇక్కడినుంచి కదలబోమని స్పష్టంచేస్తూ మహిళలు భీష్మించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ. జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండి కూడా తమను నిండా ముంచారని ఆవేదన వ్యక్తం చేశారు. తమనుఒక్క పూట ముందు అప్రమత్తం చేసినా తాము బయటపడేవాళ్లమని అన్నారు. రాత్రికి రాత్రి వరద రావడంతో వందలాది కుటుంబాల వాళ్లం డాబాలపైకి చేరి అక్కడే ఉన్నామన్నారు. కనీసం తాగునీరు పంపే నాథుడు కూడా కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. తీరా వరదపోయిన తరువాతైనా తమను ఎవరూ పట్టంచుకోలేదని, కనీసం తాగునీరు, ఆహారం వంటివి కూడా అందించలేకపోయారని అన్నారు. ఎంపీ రఘురామరెడ్డితోపాటు కొందరు నాయకులు వచ్చి ఫొటోలకు ఫోజులిచ్చి పోయారు తప్ప పిసరంతైనా సహాయం అందించలేదని ఆరోపించారు. ఇంట్లోని వస్తువులేవీ పనికి రాకుండా పోయాయని, కట్టుబట్టలతోనే తాము బయటపడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే అప్పటికే మంత్రి పొంగులేటి రాబోతున్నారని తెలుసుకున్న పోలీసులు.. ఆందోళనకారులపై విరుచుకుపడ్డారు. ఒక్కొక్కరినీ బలవంతంగా పైకి లేపుతూ రాస్తారోకోను భగ్నం చేసేందుకు యత్నించారు. అదే సమయంలో ట్రాఫిక్‌జామ్‌తో అప్పటికే భారీగా నిలిచిపోయిన వాహనాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో ఒక్కసారిగా వాహనాలన్నీ ఆందోళనకారులపైకి వచ్చే ప్రయత్నం చేశాయి. అదే సమయంలో అక్కడికి చేరుకున్న మంత్రి పొంగులేటిపై ఆందోళనకారులు విరుచుకపడ్డారు. 'అందరూ చచ్చాక వస్తే ఇంకా బాగుండేది కదా..' అంటూ నినాదాలు చేశారు. తమకు పూర్తి న్యాయం చేయకపోతే మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు.

# వరదలను అంచనా వేయడంలో విఫలం


- వరదొచ్చినా పత్తాలేని ముగ్గురు జిల్లా మంత్రులు
- బాధిత కుటుంబాలకు రూ.లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి డిమాండ్


కాలనీల్లో ముంపు బాధితులతో మాట్లాడుతున్న రాకేశ్‌రెడ్డి

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 2 : భారీ వరదలతో అంచనా వేయలేని నష్టం జరిగినా బాధితులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వ యంత్రాంగం అడ్రస్ లేకుండా పోయిందని, జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు కూడా పత్తా లేరని బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఏనుగుల రాకేశ్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ఖమ్మం జిల్లా రూరల్ మండలం నాయుడుపేట, జలగం నగర్, రాజీవ్ గృహకల్ప, నాల్గవ తరగతి కాలనీ, డీబీఆర్ కాలనీల్లో సోమవారం ఆయన బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, మాజీ జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్‌తో కలిసి 4 గంటలపాటు పర్యటించారు. బాధితుల ఇళ్లకు వెళ్లి వాటర్ బాటిళ్లు, ఆహార పొట్లాలు అందజేశారు. వరదకు ముందు పరిస్థితి, అధికారుల సహకారం గురించి బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ముంపుతో నష్టపోయిన బాధితులను చూస్తుంటే ఎంతో బాధ కలిగిందని, కేవలం కట్టుబట్టలతోనే మిగిలారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం అధికారులు, పాలకులు ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తే కొంత సామగ్రితోనైనా బయటపడేవారన్నారు. బాధితులను అప్రమత్తం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వరదలతో నష్టపోయిన ఒక్కో కుటుంబానికి తక్షణ సాయంగా రూ.లక్ష చొప్పున సాయం అందించాలని డిమాండ్ చేశారు. ముంపు ఇళ్లలో వరదలతో వందలాది మంది విద్యార్థుల సర్టిఫికెట్లు కొట్టుకుపోయాయని, తిరిగి ప్రభుత్వం వారికి ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు అందించాలన్నారు. రెండు రోజులు గుడుస్తున్నా బాధితులను పరామర్శించే నాయకుడు కూడా కరువయ్యాడన్నారు. వరద బాధితులకు నిత్యావసరాలు అందించడం ప్రభుత్వ కనీస బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముత్యం కృష్ణారెడ్డి, గూడ సంజీవరెడ్డి, శీలం శ్రీనివాస్, కనకయ్య, మానుకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## తండ్రీకూతురికి కన్నీటి వీడ్కోలు..

### నివాళి అర్పించిన ఎంపీ వద్దిరాజు


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, నాయకులు

కారేపల్లి, సెప్టెంబర్ 2: మండలంలోని గంగారం తండాలో రైతు నూనావత్ మోతీలాల్, అగ్రికల్చర్ సైంటిస్ట్ నూనావత్ అశ్వని అంత్యక్రియలు సోమవారం జరిగాయి. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం వద్ద ఆకేరు వాగులో కారుతో సహా వారు గల్లంతై మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. మహబూబాబాద్ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలు స్వగ్రామానికి చేరుకోవడంతో కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ గంగారం చేరుకొని తండ్రీకూతురు మృతదేహాల వద్ద నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దహన సంస్కారాలకు ఎమ్మెల్యే రూ.50వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం గ్రామ శివారులోని సొంత వ్యవసాయభూమిలో ఇద్దరికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. నూనావత్ మోతీలాల్, అశ్వని చిత్రపటాలకు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## నేడు విద్యాసంస్థలకు సెలవు

ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 2: జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని విద్యాసంస్థలకు భారీ వర్షాల నేపథ్యంలో మంగళవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్స్, జూనియర్ కళాశాలలు, డిగ్రీ అన్ని యాజమాన్య విద్యాసంస్థలు సెలవును అమలు చేయాలన్నారు.

## వైద్యారోగ్యశాఖ టోల్ ఫ్రీ ఏర్పాటు

ఖమ్మం సిటీ, సెప్టెంబర్ 2: వర్షాల నేపథ్యంలో జిల్లా వైద్యారోగ్యశాఖ టోల్ ఫ్రీ నెంబర్ 95022 48398ను ఏర్పాటుచేసిందని డీఎంహెచ్‌వో డాక్టర్ వరికూటి సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24గంటలపాటు అందుబాటులో ఉం టుందన్నారు.

## సస్యరక్షణ చర్యలు పాటించండి

కొణిజర్ల, సెప్టెంబర్ 2: రైతులు సస్యరక్షణ చర్య లు పాటించి పంటలను కాపాడుకోవాలని ఏవో బాలాజీ అన్నారు. గ్రామాల్లో పంటలను పరిశీలించిన ఆయన పత్తి మొదళ్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, మురుగు బయటకు పంపించాలన్నారు. పొలాల వద్ద వ్యవసాయ మోట ర్ల కనెక్షన్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

## వరద బాధితులకు అండగా 'జీవీమాల్'

### మంత్రి తుమ్మలకు రూ.10 లక్షల చెక్కు అందజేసిన యాజమాన్యం


రూ.10 లక్షల చెక్కును మంత్రి తుమ్మలకు అందజేస్తున్న జీవీ మాల్ యజమానులు

రఘునాథపాలెం, సెప్టెంబర్ 2: అధిక వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన ఖమ్మం మున్నేరు వరద బాధితులకు జీవీ మాల్ యాజమాన్యం అండగా నిలిచింది. బాధితులకు ఆర్థికసాయాన్ని అందించేందుకు సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.10 లక్షలను అందజేసింది. దీనికి సంబంధించిన చెక్కును రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు జీవీ మాల్ యాజమాన్యం గుర్రం ఉమామహేశ్వరరావు, గుర్రం నర్సింహారావు సోమవారం అందజేశారు. విపత్కర పరిస్థితుల్లో బాధితులకు సాయం చేసేందుకు ముందుకొచ్చిన జీవీ మాల్ యాజమాన్యాన్ని మంత్రి తుమ్మల అభినందించారు. కాంగ్రెస్ నాయకులు రావూరి సైదుబాబు, తుపాకుల యలగొండస్వామి పాల్గొన్నారు.

## ముంపు ప్రాంత ప్రజలకు అండగా ఉంటాం

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, సెప్టెంబర్ 2: ఖమ్మం నగరంలోని మున్నేరు ముంపు ప్రాంత ప్రజలకు ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం వీడీఓస్ కాలనీలో గల క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. నష్టం అంచనా వేసి సీ ఎం దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటామన్నారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి సిబ్బందిని తీసుకొచ్చి శానిటేషన్, విద్యుత్ పునరుద్ధరణ ఇతరత్రా పనులు శరవేగంగా చేస్తామన్నారు. సమావేశంలో బాలసాని లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## బ్రిడ్జి మరమ్మతు పనుల పరిశీలన

ఖమ్మం, సెప్టెంబర్ 2 : ఖమ్మం నగరంలో వరదలతో దెబ్బతిన్న బైపాస్ రోడ్డు బ్రిడ్జి మరమ్మతు పనులను ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సోమవారం పరిశీలించారు. ఖమ్మంరూరల్ మండలంలోని నాయుడుపేట, జలగంనగర్, పెద్దతండా, రాజీవ్ గృహకల్ప, కరుణగిరి, తీర్థాల తదితర వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు బాసటగా నిలిచి వస్తుండగా బ్రిడ్జిపై ఆగారు. అక్కడ మరమ్మతులు జరుగుతుండడాన్ని చూసి తన వాహనం ఆపి వెళ్లి పరిశీలించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తగిన సూచనలు చేశారు. ఎంపీ వెంట కొప్పుల చంద్రశేఖర్, చావా శివ రామకృష్ణ ఉన్నారు.

## వరద బాధితులకు పువ్వాడ ఫౌండేషన్ చేయూత


నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న పగడాల, కూరాకుల, ఆర్‌జేసీ తదితరులు

ఖమ్మం, సెప్టెంబర్ 2 : ఖమ్మం మున్నేరు వరద బాధితులకు పువ్వాడ ఫౌండేషన్ చేయూతనిచ్చింది. సోమవారం రాత్రి బాధితులకు నిత్యావసర సరుకులను బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. 34వ డివిజన్ కుటుంబాలకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సహకారంతో ఇంటికి 10కిలోల బియ్యం చొప్పున అందించారు. 30వ డివిజన్, 22 డివిజన్‌లో బీఆర్ఎస్ కార్యదర్శి అల్లం దుర్గారావు సహకారంతో భోజనం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్లు కమల, ఉమారాణి, భోజన ప్యాకెట్లు బాధితులకు అందించారు. పంపిణీ చేసిన వారిలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సీనియర్ నాయకులు ఆర్‌జేసీ కృష్ణ, కార్పొరేటర్లు శ్రీదేవి, కమల, నాయకులు అప్పారావు, ఉపేందర్, వీరభద్రం, దుర్గారావు, పాపారావు, వినోద్, ఖయ్యూం, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## నీట మునిగిన రేషన్‌షాపుల పరిశీలన


నీట మునిగిన రేషన్‌షాపులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి వీపీ గౌతమ్

రఘునాథపాలెం, సెప్టెంబర్ 2 : ఖమ్మం మున్నేరు వరద ఉధృతికి నీట మునిగిన రేషన్‌షాపులను ఖమ్మం మున్నేరు వరద ప్రభావిత ప్రాం తాల పరిశీలన ప్రత్యేకాధికారి వీపీ గౌతమ్ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఖమ్మం అర్బన్ పరిధిలోని నీట మునిగిన పలు రేషన్ షాపులను సందర్శించి బియ్యం స్టాకు పూర్తిగా వరద నీటిలో తడిసి ముద్దయి ఉండటాన్ని గుర్తించారు. నివేదికను సమర్పించి రేషన్‌షాపులకు బియ్యం పునః సరఫరా జరిగేలా చూడాలని డీఎస్‌వోను గౌతమ్ ఆదేశించారు. నగరంలో 2, 3, 9, 46, 50, 104 షాపులు నీట మునిగినట్లుగా గుర్తించినట్లు డీటీ విజయ్‌బాబు తెలిపారు. రేషన్‌షాపుల పంపిణీ ప్రక్రియ ప్రారంభమైనందున వరదలో మునిగిన రేషన్‌షాపులకు త్వరితగతిన బియ్యం పునః సరఫరా చేయాలని రేషన్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బానోతు వెంకన్న, షేక్ జానీమియా అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గిర్దావర్ రవి పాల్గొన్నారు.

## మధిరలో 32,564 ఎకరాల్లో పంటనష్టం

మధిర, సెప్టెంబర్ 2: తుఫాన్ కారణంగా మధిర ని యోజకవర్గంలో 32,564 ఎకరాల్లో ప్రాథమిక అంచనా ప్రకారం నష్టపోయినట్లు జిల్లా వ్యవసాయాధికారి డీ.పుల్లయ్య తెలిపారు. సోమవారం నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఆయన పంటనష్టం జరిగిన ప్రాంతాలను పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాలతో మధిర నియోజకవర్గంలో వ్యవసాయాధికారులు ప్రాథమికంగా నష్టపోయిన పంటలను గుర్తించారు. మొత్తం 32,564ఎకరా ల్లో పంటనష్టం వాటిల్లినట్లు మధిర ఏడీఏ ఎస్.విజయచంద్ర, మండలాల్లోని వ్యవసాయాధికారులతో పంటల పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టి సంబంధిత నివేదికను ప్ర భుత్వానికి పంపించనున్నట్లు తెలిపారు. ఏడీఏ విజయచంద్ర, టెక్నికల్ ఏవో అనిల్‌కుమార్, ఏఈవోలు ఉన్నారు.

**సర్వేను పాదర్శకంగా చేపట్టాలి**

మధిర రూరల్, సెప్టెంబర్ 2: మధిర మండలంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నీట మునిగిన వరి, పత్తి పంటల వివరాలు, రుణమాఫీ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య అన్నారు. సోమవారం మాటూరు గ్రామంలో వర్షాల వలన దెబ్బతిన్న పొలాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు శ్రీనివాస్, అనిల్‌కుమార్, విస్తరణాధికారులు నికిత, అమృత, వంశీకృష్ణ, సుష్మా, రైతులు పాల్గొన్నారు.

**పంట పొలాలను పరిశీలించిన డీఏవో**

ఎర్రుపాలెం, సెప్టెంబర్ 2: రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన వరి, పత్తి పంటలను, రుణమాఫీ సర్వేను జిల్లా వ్యవసాయ అధికారి డీ.పుల్లయ్య, మధిర సహాయ సంచాలకుడు ఎస్.విజయచంద్ర సోమవారం పరిశీలించారు. మండలంలోని మీనవోలు గ్రామంలో దెబ్బతిన్న వరి, పత్తి పంటలను పరిశీలించి దెబ్బతిన్న పంటల నష్టాన్ని ప్రాథమిక అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు మందుల రాధ, అనిల్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు సిందూర్, బాలకృష్ణ, కుమారి, సొసైటీ చైర్మన్ కుడుముల మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.